కథా కౌముది

# సత్యప్ప సత్యవ్రతం    కన్నడ మూలం: శ్రీమతి మధురా కర్ణమ్

## అనువాదం: చందకచర్ల రమేశ బాబు

"ఏమనుకుంటున్నారు మిమ్మల్ని మీరు ? సత్య హరిశ్చంద్రుడనా... లేక మహాత్మా గాంధీ అనా" అని గద్దించాడు వసంత్.

సత్యప్ప గోడకు వేలాడదీసిన గాంధీజీ గారి ఫోటో వైపు చూశాడు. బట్ట తల, బోసినవ్వు , కొల్లాయి గుడ్డ, కళ్ళద్దాల వెనుక నుండి గాంధీతాత నవ్వుతూ కనిపించారు.

" తండ్రిగా మీరు మాకేం చేశారు? మీ బాధ్యత ఎంతవరకూ నిర్వర్తించారు? అంతా చేసింది తాతయ్య, బాలకృష్ణ మామయ్యలు. ఇప్పుడు వాళ్ళేమో తప్పు చేశారని వాళ్ళని కాదని బయటికీడుస్తారా? సంఘం పెద్దలకు చెప్పేస్తారా?" అంటూ వసంత్ ఏకధాటిగా అరుస్తున్నా సత్యప్ప మౌనంగానే ఉన్నాడు.

గడియ సేపు ఆగి సత్యప్ప " అన్యాయం జరిగినప్పుడు తిరగబడడం నా స్వభావం" అన్నాడు. గొంతు శాంతంగానే ఉన్నా అది దృఢంగా ఉండింది.

" మీ సత్యవాదం, గాంధీవాదం అన్నీ వింటూ, కప్పుకుంటూ, ఈ సంసారపు కాడెను మోస్తూ ఇక్కడిదాకా తీసుకొచ్చాను. పుట్టింటివారి సహాయమే లేకపోతే ఇది సాధ్యమయ్యేదే కాదు. ఇప్పుడు ఈ గుట్టుని విప్పి ఇంటికి నిప్పు పెట్టకండి. మీకు దణ్ణం పెడతాను" అంటూ ఏడుపుగొంతుతో అంది లక్ష్మి.

" అబద్ధం నా రక్తంలోనే లేదు" అన్నది ధీర గంభీర, సముద్రపు ఘోషలాంటి సత్యప్ప గొంతు.

" అలాగా ! అయితే నిజం చెప్తే మీ గాంధీ పైన ఒట్టే" అంటూకోపంగా అరచి కొడుకు వసంత్ తో పాటే బయటకు నడిచింది లక్ష్మి. వెనుకనే రూము తలుపు దడాలున మూసుకుంది.

తన రెండూ చేతులతో పోటెత్తిన తలను నొక్కి పట్టుకుని సర్దుకున్నాడు సత్యప్ప. అడకత్తెరలో ఇరుక్కున్న వక్కమాదిరిగా తయారయింది తన బ్రతుకు. తన దేవుడైన గాంధీవైపు చూశాడు. అదే మైమరపించే నవ్వు, 'నాకూ ఈ అనుభవాలన్నీఅయినాయి' అన్నట్టు కనిపించే భావం. అలజడి చెందిన మనస్సు ఖిన్నతకు లోనయ్యింది. తను నమ్మిన సత్యవ్రతం... దాన్ని బోధించిన గాంధీ... అంతా అబద్ధమా అయితే ? " దాన్ని నమ్ముకుని జీవితం గడపగలమా? సత్యం... సత్యం... అంటూ హరిశ్చంద్రుడు కాటిపాలు కాలేదా? మీరు ఇంటిని వల్లకాడు చేస్తున్నారు" అంటూ భార్య అరిచేది. అయితే తన చిన్నతనం నుండి తను నడిచివచ్చిన దారి తప్పా? ఇప్పటిదాకా పాలిస్తూ వచ్చిన ఈ వ్రతాన్ని వీళ్ళకోసం వదిలెయ్యాలా ?

"కుదరదు. కుదరంటే కుదరదు" అంటూ కలవరపడింది మనసు. ఇలాంటి సంధిగ్ధ పరిస్థితిని ఎప్పుడూ అతడు అనుభవించలేదు. "కరవమంటే కప్పకు కోపం, వదలమంటే పాముకు కోపం" వంటి పరిస్థితి. ఏదో ఒకటి నిర్ణయించాలి అనుకుని మంచం పైన పడుకున్నాడు. మగతలో కనిపించింది కలా... లేదా మెలకువా అర్థం కాలేదు. పూలు, ముళ్ళతో నిండిన పొడుగాటి దార్లో ఇతడు అలవోకగా నడుస్తున్నాడు. జతగా ఉన్నవాళ్ళకు అది నిప్పుల పానుపుగా అనిపిస్తోంది. ఒక్కొక్కరే తప్పుకుని మాయమవుతున్నారు. తను ఒంటరి బాటసారి. తన ఎదురుగా ఎంతో మంది గుంపుగా నడుస్తున్నారు. ఇతడికి వాళ్ళను చేరుకోవడం కావడం లేదు. వెనుక కనబడిన ఖాళీ వీధి. అందులో దూరంగా ఒకరో ఇద్దరో... చప్పున మెలకువ వచ్చింది. సత్యం యొక్క దారి ఇంత కఠినమా అనిపించింది. తన చిన్నతనం నుండి జరిగిన సంఘటనలు ఒక్కొక్కటిగా మనోపటలం పైన రాసాగాయి. సినిమా రీళ్ళలాగా పరిగెత్తాయి.

నిజమే. అతడి పేరు సత్యనారాయణ. చింతామణి రెడ్ల ఇంట్లో 1955 సంవత్సరంలో పుట్టినవాడికి ఎలాంటి కొరతా ఉండలేదు. తినడానికి భోజనం, పాలు, పాడి, కట్టుకోవడానికి బట్టలతో పాటు వ్యంగ్యాలు, అపహాస్యాలు, తిట్లు కూడా పుష్కళంగా దొరికే చోట పెద్ద కొడుకుగా పుట్టాడు. ఇంట్లో తెలుగు, స్కూలులో రాజ్యభాష అయిన కన్నడం చదువుతూ పెరిగాడు. చిన్నతనంలో పెదనాన్న వాడికి అత్యంత ప్రీతి పాత్రుడు. పెదనాన్న నారాయణ రెడ్డి స్వాతంత్ర పోరాట వీరుడు. ఖద్దరు తొడుక్కుని బయటికి కాలు పెడితే ఊళ్ళో ఎక్కడా లేని గౌరవం కనిపించేది. సత్య ఆయన వెంట తిరుగుతూ రామాయణం, మహాభారతం, సత్య హరిశ్చంద్ర ఇలాంటి కథలను వింటూ నడిచేవాడు. తమ స్వాతంత్ర్య పోరాటంలోజరిగిన సంఘటనలను ఆయన వివరించి చెబుతుంటే ఒళ్ళు మరచిపోయేవాడు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నది, క్విట్ ఇండియా ఉద్యమం, ఆంగ్లేయుల గుళ్ళనుండి తప్పించుకుని వారికి టోకరా ఇచ్చింది, ఒక కొల్లాయి గుడ్డ కట్టుకుని గాంధీగారు లండన్ లోని రౌండ్ టేబల్ సమావేశానికి హాజరయ్యింది– ఇవన్నీ వింటూ ఉంటే ఒళ్ళు పులకించేది. ఏదో సినిమా చూసినట్టనిపించేది. అందులో గాంధీజీ హీరో అయితే, పెదనాన్న సహాయ నటుడు. సాబర్మతి ఆశ్రమంలో కొన్ని రోజులు గాంధీగారితో గడిపిన ఆయన ఆశ్రమంలోని క్రమశిక్షణ, ప్రార్థనలు, అందరూ

వంతులవారిగా అన్నిపనులు చెయ్యాడం, శౌచాలయాలను శుభ్రపరచడం, గాంధీజీ సత్యనిష్ఠ, ఆత్మసంయమం, మనోనిగ్రహం గురించి వింటూ ఇలా ఉండాలి అనే ఒక రూపు మనసులో నిలిచిపోనారంభించింది. గాంధీజీ గురించిన పుస్తకాలను చదువుతూ ఆయనను ఒక శిల్పంగా మార్చి తన మదిలో ప్రతిష్ఠాపించుకున్నాడు. సత్య సత్యవ్రతుడయ్యాడు. గాంధీజి అతడి ఆరాధ్య దైవమయ్యాడు.

తొలుత రోజుల్లో ఈ విషయం పెద్దగా పట్టించుకునే విషయంగా కాకుండా అందరికీ అభిమానంగా ఉండింది.

"పెదనాన్న వీడి నెత్తి పైన చెయ్యి పెట్టి పోయినాడు" అంటూ నవ్వేవారు.

ఎంతోమంది గాంధీజీ గారిని ఆరాధించే శకంలో ఇదొక విచిత్రమనిపించలేదు. అతడి గదినిండా గాంధీజీగారి ఫొటోలు రారాజించేవి. కాని రోజులు గడిచే కొద్దీ అతడి సత్యనిష్ఠ ఉమ్మడి కుటుంబానికి సమస్య కాసాగింది. ఇంటి మగవాళ్ళకు తెలియకుండా ఆడవాళ్ళు కొబ్బరికాయలు అమ్ముకునే సంగతిని బయటపెట్టి ఆడంగుల కోపానికి గురయ్యాడు. ఒకసారి తండ్రి  శ్రీపతిరెడ్డికి ఏదో విషయంలో ఇబ్బంది ఎదురయ్యింది. ఆఫీసునుండి ఎవరైనా తనను అడిగితే లేనని చెప్పమన్నాడు. ఆ వచ్చినవాడు ఇతణ్ణే అడగాలా? " అదిగో చూడు. తన గదిలో కూచున్నాడు" అనేశాడు. గుర్రుమని ఇతణ్ణి చూస్తూ ఆఫీసుకెళ్ళిన ఇతడి తండ్రి తిరిగొచ్చి చర్నాకోలతో వాతలు తేలించాడు.

దీనివలన మనవాడి సత్యనిష్ఠ తక్కువ కాలేదులెండి. స్కూలులోనూ కొనసాగింది. పరీక్షల్లో కాపీ కొడుతున్న కృష్ణ గురించి మాస్టారికి చెప్పేశాడు. ఆయన పేపర్ లాక్కుని వాణ్ణి బయట నిలబెట్టారు. పరిగెట్టుకుంటూ వచ్చిన హెడ్ మాస్టర్ గారు వాడిని ఇంకోమారు చెయ్యరాదని హెచ్చరించి మళ్ళీ కూర్చోబెట్టారు. మాస్టారుగారిని పిలిచి " మన స్కూలంతటినీ కొనగల శ్రీమంతుడయ్యా వాడి నాన్న" అంటూ నచ్చజెప్పారు. కాని అంతటితో అది ఆగలేదు. మరుసటి రోజు కృష్ణ ఒక గుంపును తీసుకొచ్చి వీడి చెంప వాయించాడు. మనవాడు అహింసావాది కదా, మరో చెంప చూపించాడు. వీడికి మద్దతుగా వచ్చిన స్నేహితులూ చేరి క్లాసులోనే కాకుండా, స్కూలులోనే రెండు వర్గాలయ్యాయి. పోట్లాటలకు అఖాడాలయ్యాయి. " కుర్ర గాంధీ" అనే పరిహాసం మొదలయింది. తెరచాటు వ్యవహారాలకు సింహస్వప్నంగా మారాడు సత్య.  ఈ సన్నివేశం అలా పెరుగుతూ పోయిందే కాని తగ్గలేదు. ఇంట్లో, చిన్నాయన పనిమనిషి సింగి జడ లాగడం, పొలంలో సరసిని కలిసింది, ఆయన లెక్కల్లో సున్నా సంపాదించిన మార్కుల పట్టీని దాచింది, అంతా బయట పెట్టాడు. తలిదండ్రులకు ఇతడు చెంగులో కట్టుకున్న నిప్పయ్యాడు. కానీ బుద్ధిమంతుడు, బాగా చదివేవాడు అనేదొకటే నెమ్మది. ఎస్సెస్సెల్సి లో మంచి మార్కులు సంపాదించి, ఇంటరు ముగించి డిగ్రి కోసం బెంగళూరు హాస్టల్ లో చేరగానే ఇంట్లో అందరూ నిట్టూర్చారన్నది వాస్తవం.

కాలేజీ చదువు ప్రారంభమయ్యింది. యౌవనం ఆవరించినా అక్కడి వికసించే పువ్వులు, ఎగిరే సీతాకోక చిలుకల నడుమ గాంధీగారిని మదిలో ఉంచుకుని తన సంయమనం కాపాడుకున్నాడు సత్య. స్వాంతత్ర్య దినోత్సవం రోజు

జరిగిన వక్తృత్వ పోటీల్లో గెలిచి బహుమతి సంపాదించుకున్నప్పుడు అతడికి దాసోహమన్నది నళిని. చొట్టబుగ్గల అందగత్తె, గాంధీజీగారి కథలనన్నిటినీ ఆసక్తితో విని విశ్లేషించేది. గాంధీజీ గురించి అనేక పుస్తకాలను చదివిన తరువాత ప్రేమ చిగురించింది. మొలకలేసింది. లాల్ బాగ్, కబ్బన్ పార్కులు ఈ జంటను దీవించాయి. ఇద్దరి జాతులు వేరైనా అవి అడ్డగోడలుగా నిలవలేదు. అదీ కాక, గాంధీవాదం నీడన జరిగే అంతర్జాతీయ వివాహంగా మన్నలనందాయి. బి.కాం అవగానే ఎం.కాం చదువుతూ ఉద్యోగాల వేట మొదలుపెట్టాడు సత్య. కానీ ఆ రోజుల్లో ఉద్యోగాలు అంత తేలికగా దొరికేవి కావు. అర్జీలు పెట్టుకుని తిరగడమే కానీ దొరకలేదు. ఎం. కాం అయిపోయినా ఉద్యోగం దొరకలేదు. నళిని కూడా అతడి ఉద్యోగాని కోసం తీవ్రంగా ప్రయత్నించింది.

చివరకు ఒక పరిచయస్థుడి ద్వారా ఒక కాలేజీలో లెక్చరర్ ఉద్యోగానికి కాల్ వచ్చింది. దాంతో పాటు ఎంతో కొంత లంచం ఇవ్వాల్సివస్తుందని కూడా తెలిసింది. ఇంటర్వ్యూ బాగానే చేశాడు కానీ తను గాంధీవాదినని, తన తత్త్వాలకు వ్యతిరేకంగా ఒక్క పైసా కూడా లంచం ఇవ్వనని ఖరాఖండిగా చెప్పేశాడు. నళిని కోపంతో దెబ్బలాడింది. ప్రేమగా బుజ్జగించింది. ఒట్లు పెట్టింది. " ఇలాంటి అవకాశం మళ్ళీ రాదు. ఒక్క సారి.... ఒక్కసారికి ఇచ్చేద్దాం. తరువాత ఎప్పుడూ ఇక గాంధీవాదమే" అని వేడుకుంది. సత్య కరగలేదు.

"అవన్నీ వినడానికి సొంపుగా ఉంటాయి. జీవితంలో నిర్వహించడం కష్టం" అని నచ్చజెప్పింది.

సత్య రాతి స్థంబంలా నిలబడ్డాడు. ఆమె కూడా కోపంతో మౌనం మొదలెట్టింది. ఆలోచనల దారులు వేరై చివరికి ఇద్దరూ విడిపోయారు. సత్య బాధపడలేదని కాదు, కానీ ప్రేమ కోసం తన సిద్ధాంతాన్ని త్యజించడం అతడి తత్త్వం కాదు అనుకున్నాడు. కల చెదిరింది. తన దేవుడి ఫోటో ముందు ఆయన పాదంతో పాటు కర్రను కూడా పట్టుకుని ఏడ్చాడు.

అప్పుడే లక్ష్మి సంబంధం వచ్చింది. ఆమె తండ్రి కేశవరెడ్డిగారు బెంగళూర్లోనే గట్టి ఆసామి. సత్య ఇంట్లో అందరికీ నచ్చింది. నిజం చెప్పాలంటే ఈ గాంధీ పుత్రుణ్ణి ఇంటినుంటి హాస్టల్ కు పంపినట్టు, మనసులలో నుండి కూడా నెట్టేశారు ఇంటివారు. ఇప్పుడు మళ్ళీ మామూలు మనిషి కావచ్చుననే ఆశతో శ్రీపతిరెడ్డి ఇంటివారు సంతోషించారు. కేశవరెడ్డిగారు కూడా మధ్యవర్తుల ద్వారా పిల్లవాడి గుణస్వభావాలను తెలుసుకున్నారు. "ఉడుకు రక్తంలో గాంధీవాదాలన్నీ మామూలే. జీవన ప్రవాహంలో పడ్డాక అవే సర్దుకుంటాయి లెండి" అని నవ్వేశారు. తరువాత సత్యకు శుక్రదశ. రెవెన్యూ డిపార్ట్ మెంట్ లో వ్రాతపరీక్ష రాయగానే ఇంటర్వ్యూకు పిలుపొచ్చింది. అక్కడ అడిగిన ఐదు ప్రశ్నలలో రెండింటికి మాత్రమే జవాబు చెప్పినా సెలెక్టయ్యాడు. దీని వెనుక ఉన్నహస్తం గురించి తెలిసింది పెళ్ళయిన తరువాతే.....

ధూం ధాంగా మూడు రోజులపాటు జరిగిన పెళ్ళిని చూసి శ్రీపతిరెడ్డి సంతోషిస్తే, ఆయన భార్య ఆనంద బాష్పాలు కురిపించింది. తన సత్య వ్రతంతో విచిత్ర ప్రవర్తన కలిగిన కొడుకునుండి ఈ రకమైన సుఖం దొరుకుతుందని కలలోకూడా అనుకోలేదు ఆ దంపతులు. అన్నీ అనుకున్నట్టే వైభవంగా జరిగాయి. అమ్మాయి తండ్రి తమ అమ్మాయి

చేతిని సత్య చేతిలోపెడుతూ " చాలా ముద్దుగా పెంచాము అల్లుడూ" అంటూ గద్గదితమయ్యారు. సత్యకు అంతా అయోమయం, ఇబ్బందికరం అనిపించి కొంత కోపం కూడా వచ్చింది. సరళ వివాహం కావాలని నొక్కి అన్నప్పుడు "అలాగే. కాకపోతే కొంతమంది దగ్గరి బంధువుల ఎదుట శాస్త్రోక్తంగా పెళ్ళి చేస్తాం" అన్నారు అప్పుడు. ఈరోజు పెళ్ళి మండపం లో వేల కొలది జనం. సత్యప్ప ప్రశ్నార్థకంగా చూసినప్పుడు "అంతా మా వైపు, మీవైపు బందువులే ! నూతన వధూవరులకు అందరి ఆశీర్వాదాలు కావాలి కదా . గాంధీజీగారు ఉపన్యాసం వినడానికి వేలకొలదీ జనాలు వచ్చేవారు కదా. అలా వచ్చినవారిని చూసినప్పుడు గాంధీజీ కూడా సంతోషించేవారే కదా!" అంటూ దేనికో పోలికనిచ్చి అతడి నోరు మూయించారు. కానీ సత్య ముఖం మాడ్చుకుంది నిజం.

క్రొత్త జీవితం ప్రారంభమయ్యింది. ఊటి, కొడైకనాల్ హనీమూన్ కు మామగారే టిక్కట్లు బుక్ చేయించారు. నళినిని మరచిపోయి లక్ష్మితో కలసిపోవడం కష్టమనిపించినా సర్దుకుపోయాడు సత్య. గాంధీజీ గారి నిరాడంబరత, సాబర్మతి ఆశ్రమం...వీటి గురించి వర్ణించాడు లక్ష్మి గడుసుగా " మనం ఇక్కడికి వచ్చింది హనీమూన్ కా లేదా గాంధీజీ గారి గురించి తెలుసుకోవడానికా" అన్నప్పుడు ఊరుకోవాల్సి వచ్చింది. ఆమె అందరి దారిలోనే వెళ్ళే మనిషి అని అతడికి తెలిసిపోయింది. ఐనా ఆమెదేం తప్పు? బాల్యం నుండి వైభవంలోనే పెరిగిన పిల్లకు గాంధీగారి నిరాడంబరత గురించి చెప్పడమంటే దున్నపోతు పైన వాన కురిసినట్లే అనిపించింది. ఆమెకు ఇతడి స్వభావం కొత్తది. ఆమె బంధువులంతా బాగా తిని తాగి, మంచి బట్టలు, నగలు దిగేసుకుని విర్రవీగడమే జీవితం అనుకున్నవారు. లక్ష్మి వాళ్ళిళ్ళల్లో తాండవమాడుతుంది మరి. వీళ్ళందరి మధ్య గాంధీజీ నిరాడంబరత.. ఆదర్శాలను వల్లిస్తూ, వారి నీడలో బ్రతకాలనుకునే భర్త విచిత్రంగా కనిపించసాగాడు ఆమెకు. కొన్ని రోజుల పాటు అటు పుట్టింటివాళ్ళను, ఇటు భర్తనూ బుజ్జగిస్తూ కష్టపడింది. క్రమంగా తండ్రి దారిలోనే జీవితచక్రాన్ని తిప్పసాగింది. అతడి సత్యపు దార్లో అతడి అడుగుజాడలు మాత్రమే పడసాగాయి.

కొత్త ఉద్యోగం కూడా అతడిలో దిగులు కలిగించసాగింది. రెవెన్యూ డిపార్ట్ మెంట్.. పైనుండి కింది దాకా లంచాలే. తిరగబాటుకు అర్థమే లేనటువంటి వ్యవస్థ. తన వ్యతిరేకత చెల్లదని అర్థమయిపోయింది సత్యకు. తనకు ఉద్యోగం దొరికిందే తన మామగారి కృపాశీర్వాదల వల్ల అని తెలిశాక ఇంకా కుంగిపోయాడు. ఎవరికీ తెలియకుండా మరోచోట దరఖాస్తు పెట్టుకున్నాడు. తాత్కాలికంగా ఒక బ్యాంకులో ఉద్యోగం దొరికింది. ఇంట్లో ఘోర సంగ్రామమే జరిగింది. ఇటు శ్రీపతిరెడ్డి... అటు కేశవరెడ్డి ఇద్దరూ కోపోద్రిక్తులయ్యారు. ఆడంగుల కళ్ళల్లో గంగాయమునలు కనిపించాయి. చేతిని, జేబుని నింపే ఉద్యోగాన్ని వదలి బ్యాంకులో చేరడమా? " కుదరదు" అన్నారు. కాని, సత్య ఒక నిర్ణయానికి వచ్చేశాడు, బ్యాంకులోనే తన భవిష్యత్తు దిద్దుకోవాలని, గాంధీగారి తత్త్వాలను కొనసాగించాలని. చివరికి గాంధీజీయే ఆశాకిరణమయ్యారు. ఇంట్లో సత్యాగ్రహం ఆరంభించాడు. ఉపవాసం రెండో రోజు దాటింది. నిరుపాయంగా

అందరూ ఒప్పుకున్నారు. మూడో రోజు నిమ్మ రసం తాగి చిరునవ్వుతో ఉపవాసం విరమించాడు. కేశవరెడ్డిగారు తన కూతురితో

“అమ్మ! నువ్వు చింతించకు. అతడు ఎలాగయినా ఉండనీ. నేను నీకు అండగా ఉంటాను. ఆ ఏడుకొండలవాడు, వాసవి అమ్మవారు అంతా మంచే చేస్తారు” అన్నారు. దాన్ని చివరిదాకా పాటించారు కూడా.

పిల్లలు వసంత్, శిరీషలు కూడా “ నాన్నా. అది కొనివ్వు” అని అడగలేదు.

బదులుగా “ తాతా. అది కొనివ్వు” అన్న మరుక్షణమే కొనిపించేవాడు బాలకృష్ణ మామ. నగలు, దుస్తులే కాదు. మూడు చక్రాల సైకిల్ నుండి మోటర్ బైకు, మొబైల్ వరకు. సత్యప్ప ఇచ్చింది వాళ్ళ స్కూలు ఫీజు మాత్రమే. వారందరి ఆడంబర బ్రతుకుల మధ్య కేవలం ఒక గుమాస్తాగా తన గాంధీతత్త్వాలతో ఒక మూలకు వెళ్ళిపోయాడు సత్య.

అతడి సత్యవ్రతం అతడి ఉద్యోగంలో కూడా తలదూర్చి అందరి విమర్శలకు గురయ్యింది. “ ఎక్కడయ్యా! మీ గాంధీ? వచ్చారా?” అనే పరిహాసపుమాటలు అతడి వెనుక వినిపించేవి. అన్నిటినీ పెడచెవిని పెట్టి తన దారిలో కొనసాగాడు సత్య. అన్ని క్షేత్రాల్లో ఉన్నట్టే ఇక్కడ కూడా కొన్ని రహస్య వ్యవహారాలున్నాయి. గోల్ మాల్ నడిచేది. సత్యకు తెలిస్తే దానికి చరమగీతమే. అందుకే అందరూ అతడిని ఇంకో చోటికి బదిలీ చేసి తలకాయ నొప్పిని తప్పించుకోవాలని ఎదురు చూస్తున్నారు. అలా అతడు బాగలకోట్, అథణి, తిపటూరు, కోలార్ అంటూ కర్నాటక రాష్ట్రపు మూల మూలలకు తిరుగుతూనే ఆఫీసరయ్యాడు. కేశవరెడ్డి తన కూతురు గర్భిణి, ప్రసవం, బాలింత తనం, పిల్లలు అంటూ అతడి వెంట పంపకుండా తన వద్దనే ఉంచుకున్నాడు. తరువాత పిల్లల చదువుల సాకుతో పంపలేదు. సత్యప్ప లోన్ తీసి బెంగళూర్లో ఇల్లు కట్టగానే లక్ష్మి పిల్లలతో అక్కడే ఉండిపోయింది. అరికాళ్ళలో చక్రాలున్నట్టు సత్యప్ప ఊళ్ళు తిరుగుతూనే గడిపాడు. దార్లు వేరయ్యాయి, విలువలు మారిపోయాయి, ఇద్దరి ప్రపంచాలే వేరయ్యాయి.

సంసారం గురించి పట్టించుకోకుండానే సత్యప్ప ఆత్మసంయమనం సాధించి బ్రహ్మచర్యాన్ని పాటించాడు. వెళ్ళిన చోటల్లా గాంధీవాదాన్ని ప్రతిపాదించి సంఘాలను ఏర్పరిచాడు. భజనలు జరిగాయి. బీదలను, దళితులను ఆదుకోవడానికి ప్రయత్నించాడు. గాంధీజీ జీవితాశయాలను తను పాటిస్తూనే ఇతరులకు కూడా నేర్పడానికి ప్రయత్నించాడు. వేళ్ళ పైన లెక్కపెట్టగలిగినంత మంది ఇతడి అనుయాయులయ్యారు. మిగతావాళ్ళు విమర్శిస్తూ నవ్వారు. వీళ్ళందరి నమ్మకాన్ని కూకటి వేళ్లతో సహా పీకేసేలా ఒక సంఘటన జరిగింది.

తిపటూర్లో పని చేసేటప్పుడు ఒకసారి పదిహేను లక్షల కుంభకోణం జరిగింది. అందులో సత్య, అకౌంటెంట్ రాజారావ్ పేరు వినిపించింది. ఇద్దరూ నిజాయితీ పరులే. కొందరు ఉద్దేశపూర్వకంగా ఇరికించినట్టు అనిపించింది. బ్యాంకువాళ్ళు జరిమానా విధించి విషయాన్నిలోలోపలే మూసేయడానికి ప్రయత్నించారు. దానికి సత్య ఒప్పుకోలేదు. న్యాయం కావాలని పట్టు పట్టాడు. గాంధీజీ ఫోటో పెట్టుకుని సత్యాగ్రహం చెయ్యడానికి సన్నిద్ధమయ్యాడు. రాజారావ్ కూడా జాయినయ్యాడు. ఎవరెన్ని విధాలుగా చెప్పినా తగ్గలేదు. కొన్నాళ్ళకు వాళ్ళ పైన దాడి కూడా జరిగింది.

సత్య బెదరలేదు. గాయాలు తగిలినా భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నాడు. పై అధికారులకు విషయం తెలిసి, విచారణ జరిపించారు. సత్య, రాజారావ్ ల నిజాయితీ ఋజువయ్యింది. అపరాధులకు శిక్ష పడింది. సత్యకు ప్రమోషన్ అయ్యి మేనేజర్ అయ్యాడు.

ఇంట్లోకూడా మార్పులు చోటు చేసుకున్నాయి. తాతగారి సహాయంతో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వసంత్ కు ఉద్యోగం దొరికింది. తాత కొత్త కారు ఇచ్చారు. శిరీష డిగ్రీ అయిపోగానే, కేశవరెడ్డి ఆమెకొక అబ్బాయిని చూశాడు. అప్పుడు హుబ్లిలో ఉద్యోగం చేస్తున్న సత్య వచ్చి పిల్లలకు సరళ వివాహం యొక్క ప్రాముఖ్యత గురించి చెప్పాలని చూశాడు. కానీ ఇద్దరు పిల్లలూ తిరగబడ్డారు.

" మీ ఆదర్శాలు మీ దగ్గరే ఉంచుకోండి. మేము మా జీవితాన్నివైభవంగా గడపాలనుకున్నాము" అన్నారు.

తాత పెంచి పెద్ద చేసిన చెట్టు పళ్ళు కదా వీళ్ళు ! ఇంకేం మాట్లాడకుండా పిల్లల పేరిట తాను కూడబెట్టిన సొమ్మును భార్యకిచ్చినవాడు, మళ్ళీ పెళ్ళి సమయానికే వచ్చాడు. ఇంద్రుడి కొలువులాంటి పెళ్ళి మంటపం, వైభవంగా పెళ్ళి అంతా తన మామగారి కృప అని తెలిసి తన తత్త్వాలను తలచి మూగవాడయ్యాడు. వసంత్ పెళ్ళి కూడా అంతే వైభవంగా జరిగింది. అందరికీ గాంధీజి తత్త్వాలను బోదించేవాడి ఇంట్లో ఆ తత్త్వాలకు తావే లేకుండా పోయింది.

కాలం అలా సాగిపోతూ సత్యప్ప రిటైరయ్యాడు. మెడలో దండ, చేతిలో పళ్ల బుట్ట పెట్టి అతడిని ఇంటికి పంపి బ్యాంకులోని ఎంతో మంది నిట్టూర్చారు. ఇంటికి వచ్చినాక సత్యకు ఇబ్బంది కలిగింది నిజమే. ఇన్ని రోజులుగా ఎలాగో నెట్టుకొచ్చిన జీవితానికి ఇప్పుడు తను స్వతంత్రుడిని కానన్న భావం కలగసాగింది. ఇంట్లో వాళ్ళకు కూడా అలాగే. ఇన్ని రోజులూ స్వేచ్ఛగా గడిపిన వారికి ఇప్పుడు సంకెళ్ళు వేసినట్టయింది. గదుల్లో గాంధీజీ పోటోలు రారాజించ సాగాయి.  గాంధీ సంఘానికి సభ్యుడిగా ఉంటూ, రోజూ అక్కడికి వెళ్ళొస్తున్న సత్య ఇప్పుడు కార్యదర్శయ్యాడు. అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ నాయకత్వం వహించసాగాడు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న ఆడపిల్లల కోసం ఒక హాస్టల్ ప్రారంభించబడింది. సంఘమే వారి చదువు యొక్క బాధ్యత తీసుకుంది. వయసుడిగిన కేశవరెడ్డిగారు కూడా పెద్ద మొత్తమే దానం చేసి అల్లుడు చేసే ఈ పనిని మెచ్చుకున్నాడు. తిపటూరులో భజనలకు వస్తూ తనకు సహాయ పడుతున్న వందన అనే  పేద అమ్మాయిని ఆ హాస్టల్ లో చేర్పించాడు సత్యప్ప.  అంతవరకూ ఆమెను చూసుకుంటున్న ఆ అమ్మాయి బంధువులు సంతోషించారు. ఇక్కడే ఆమె సౌందర్యం వికసించింది. శ్రద్ధగా చదువుతూ కాలేజి మెట్లెక్కింది. సత్యప్ప అన్ని వైపులా చూసుకుంటున్నాడు. అంతా బాగానే నడుస్తోందనిపించింది.  ఈ సంఘటన జరిగేదాకా..........

ఏదో పని నిమిత్తం నాలుగు రోజులు ఊరికెళ్ళి రాగానే వందన ఏడుపు మొహంతో ఎదురుగా వచ్చింది. "ఏమయిందమ్మా" అని అడుగగా

" అంకుల్ ! నిన్న రాత్రి మీ బావమరది బాలకృష్ణ నా పైన అత్యాచారం చేశాడు. అరచినా ఎవ్వరూ రాలేదు. నోరు మెదిపితే చంపేస్తాను అని బెదిరించాడు. ఇలాంటి అనుభవం ఇంతకు ముందు కూడా కొంత మంది అమ్మాయిలకు జరిగింది. భయంతో ఎవరూ బయటికి చెప్పలేదు" అన్నది వెక్కుతూ.

ఆశ్చర్యపడిన సత్యప్ప క్రుద్ధుడయ్యాడు. వెంటనే విచారణ జరిపాడు. అతడి కుడి భుజమైన మాదేశ, వాచ్ మన్ జరిగిన సంగతిని ధృవీకరించారు. సాక్షులను కూడా చూపారు. మ్యానేజర్ మూర్తి మాత్రం " అలాంటిదేమీ లేదు" అని గట్టిగా అంటూ వందన వైపు గుర్రుగా చూశారు. ముఖ్యస్థులయిన తిమ్మణ్ణ కూడా వచ్చి చేరుకున్నాడు. మూర్తిని తక్షణమే తొలగించి, గాంధీవాది అయిన పంచాలయ్యను నియమించడం జరిగింది. కానీ సత్యప్పకు మనసాగలేదు. " వందన లాంటి అనేక పువ్వుల శీలానికి వెల లేదా అయితే. బాలకృష్ణకు ఇదేం ఆట మైదానమా ?"అంటూ మనసులో బాధపడ్డాడు. జ్ఞాపకాలు అతడిలో ఆర్ద్రత నింపాయి.

ఢిల్లీలోని సంఘం యొక్క అధ్యక్షుడికి విషయాన్నితెలియబరచాలని నిర్ణయించాడు. కానీ ఇంట్లో అప్పుడే పెద్ద అలజడి జరగసాగింది. భార్య, పిల్లలు అంతా బాలకృష్ణ వైపు నిలిచి వ్యతిరేకించసాగారు. చేతికర్రతో వణుకుతూ వచ్చిన కేశవరెడ్డ అతడి చేయి పట్టుకుని "నా కొడుకు ఏదో తప్పు చేశాడు అల్లుడుగారూ! వాణ్ణి బయట పెట్టకండి. ఇన్ని రోజులూ మీ సంసారాన్ని చూసుకున్నాను. ఇదొక్క సారి అబద్ధం చెప్పినా మీ గాంధీజి మిమ్మల్నేమనరు" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. సత్యప్పలో అంతర్మథనం ప్రారంభమయ్యింది. అతడి సత్యవ్రతాన్ని అందరూ ఎరిగినవారే. అతడి మాటకు, పోరాటానికి ఒక గౌరవం ఉంది. అదే లేకపోతే వీళ్ళు ఈ మొత్తం ఘటనను మూసేయగలరు. జీవితమంతా తను అనుసరించిన దారి గురించిన ప్రశ్నలు సతాయించాయి. ' నిజమా.... గాంధీవాదం లాంటి విలువలు కేవలం చెప్పడానికి, రాయడానికి మాత్రమే ఉన్నాయా? ఆచరణలోకి తీసుకురావడానికి కావా ? ఆ దారిలో నడచిన గాంధీగారు మహాత్ములయ్యారు. తనకు మాత్రం హేళన, వ్యంగ్యాలే కనబడుతున్నాయి. అయితే సత్యవ్రతాన్ని అనుసరించడం తప్పా ?" అని ఏవేవో ఆలోచనల మధ్య కూడా అతడి నిర్ణయం అచలంగా నిలిచింది. దాని వెనుక వందన మొహం తొంగి చూస్తోంది. ప్రాణం తీయడానికి కూడా వెనుకాడని మనుషులు. అందంగా వికసించిన పువ్వు స్మశానానికి వెళ్ళరాదు. తాము నమ్మిన గాంధీగారు తమను కాపాడుతారా?

రాత్రి భోజనం వడ్డించి తలుపు చప్పుడు చేస్తూ వేసుకుంది లక్ష్మి. ఇష్టం లేకున్నా తిని, సాక్షుల పేర్లు, జరిగిన సంఘటన గురించి వివరిస్తూ రెండు లేఖలు రాసిపెట్టుకున్నాడు. ఒకటి ఢిల్లీలోని అధ్యక్షుడికి, మరొక్కటి పోలీసులకు. తన దుస్తులు, డబ్బు, ల్యాప్ టాప్ అంతా సూట్ కేస్ లోకి నింపాడు. " ప్రాణం పోయినా కానీ ఆదర్శాలను మాత్రం వదలను. మీనుండి దూరంగా వెళ్ళిపోతున్నాను. వెతక్కండి" అని రాసిన కాయితాన్ని టేబల్ పైన పెట్టాడు. నిద్ర మాత్ర మింగి గురక పెట్టోన్న భార్యతో సహా ఇల్లు నిద్రిస్తోంది. తలుపులను చివరి సారిగా తాళం వేసుకుని, నిర్భావుకుడిగా బయటపడ్డాడు. అలాగే ముందుకు వెళ్ళి తను రాసిన లేఖలను పోస్ట్ బాక్స్ లోకి వేశాడు. వందనను ఒకసారి

చూడాలనిపించింది. వాచ్ మన్ కి ఫోన్ చేసి వివరాలు చెప్పాడు. హాస్టల్ చేరేటప్పటికి గాంధీబొమ్మ క్రింద వాచ్ మెన్ తోపాటు వందన కనిపించింది. " అంకుల్ ! నన్నూ తీసుకెళ్ళండి. ఇద్దరూ ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోదాం. మన దేవుడున్న చోటికి...."అని ఏడుపు స్వరంతో అంది.

వాచ్ మన్ కూడా " అదే మంచిది సార్. మీరు లేకుంటే వీళ్ళంతా కలిసి ఈమెను చంపేస్తారు" అన్నాడు.

ఒక్క క్షణం చింతాక్రాంతుడై ఆమెతో పాటు గాంధీజీ పాదాల చెంత కూర్చున్నాడు. " తనేమో ఊర్లు తిరుగుతూ ఎలాగైనా బతకొచ్చు. కానీ, భవిష్యత్తు గడపలో నిలబడిన ఈ అమ్మాయిని ఎక్కడికి తీసుకెళ్ళాలి?" అనిపించినా మనసు మాత్రం " ఇప్పుడు నీకు అరవైరెండు సంవత్సరాలు. ఇంకా ఒక ఇరవై సంవత్సరాలైనా నువ్వు బతకొచ్చు. అంతలో ఇంకా వేలకొలది అడుగులు వెయ్యొచ్చు గాంధీగారి అడుగుజాడల్లో. ఈ అమ్మాయికి ఒక దారి చూపవచ్చు. తరువాత ఆ అమ్మాయి లక్షలకొలది అడుగులు వెయ్యవచ్చు" అని ఉపదేశించింది.

నిర్ణయం గట్టిపడింది. వందన చెయ్యి పట్టుకుని " పద... బయలుదేరదాం" అన్నాడు. ఆ అమూల్య క్షణాలకు సాక్షిగా నిలిచిన వాచ్ మేన్ చిరునవ్వు నవ్వాడు. అతడితో పాటు గాంధీజీ కూడా. సత్యప్ప గాంధీజీగారి చేతిలోని కర్రను తీసుకుని, " దార్లో కుక్కలు మొరిగితే ఉండనీ" అన్నాడు. ఇద్దరూ ముందుకు నడుస్తూ కనుమరుగయ్యారు.

మరుసటి రోజు పత్రికలలో " గాంధీజీ ఆదర్శాలను చాటుతూ... గాంధీ వాదాన్ని వ్రతంగా పాలించిన సత్యప్పకు పురస్కారం" అనే వార్త కనిపించింది. దాన్ని చూసిన లక్ష్మి , వసంత్ సంతోషపడుతూ సత్యప్ప గదికి వచ్చారు. అక్కడ అతడు కనిపించలేదు. ఆయన రాసిన కాయితం కనిపించింది. చదివి మ్రాన్పడిపోయారు. భర్త ఆదర్శాలు, మంచి స్వభావాన్ని తలచుకుని వెక్కింది లక్ష్మి . ఇవన్నిటినీ లెక్క చెయ్యకుండా గాంధీవాదాన్నిమోసుకుంటూ రైలు గాంధీగారి ఊరివైపు వెళ్ళసాగింది .

COMMENTS